
వరంగల్ పశ్చిమ టికెట్ దక్కకపోవడంతో అనుచరుడితో కలిసి ఏడుస్తున్న బీజేపీ నాయకుడు రాకేశ్‌రెడ్డి

## బీజేపీలో అసంతృప్తి సెగలు

- పశ్చిమ టికెట్ దక్కకపోవడంతో రాకేశ్‌రెడ్డి వర్గం ఏడుపులు
- ఉమ్మడి జిల్లాలో 9 సీట్లకు అభ్యర్థులు
- ఇల్లందు, భద్రాచలం సీట్లకు సైతం.. పెండింగ్‌లో మిగిలిన స్థానాలు

వరంగల్, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ ఎన్నికల తొలి జాబితాపై అసంతృప్తులు మొదలయ్యాయి. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి వర్గం ఏడుపులు మొదలు పెట్టింది. ఆదివారం మధ్యాహ్నం బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించారు. జనగామకు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్‌కు జీ విజయరామారావు, పాలకుర్తిలో లేగ రామ్మోహన్‌రెడ్డి, డోర్నకల్‌కు భూక్యా సంగీత, మహబూబాబాద్‌లో జాటోతు హుస్సేన్ నాయక్, వరంగల్ పశ్చిమలో రావు పద్మ, వరంగల్ తూర్పులో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వర్ధన్నపేటకు కొండేటి శ్రీధర్, భూపాలపల్లికి చందుపట్ల కీర్తిరెడ్డి, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్, ఇల్లందుకు రవీంద్రనాయక్, భద్రాచలంలో కుంజా ధర్మారావుకు టికెట్లు ఇచ్చింది. అత్యధిక స్థానాల్లో టికెట్లకు పోటీ లేకపోవడంతో పార్టీ ఈ స్థానాలను ప్రకటించింది. అభ్యర్థులు అసలే లేని పరిస్థితి ఉన్న నర్సంపేట, పరకాల, ములుగుతోపాటు హుస్నాబాద్, మంథని స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. ఈ స్థానాల కోసం ఇతర పార్టీల్లోని నేతలు ఎవరైనా వస్తారా అనే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. బీజేపీలో ఇతర పార్టీల నుంచి చేరిన వారికే ఎక్కువ స్థానాల్లో అవకాశం ఇచ్చారు. వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఇటీవలే బీజేపీలో చేరారు. పాలకుర్తి బీజేపీ అభ్యర్థి లేగ రామ్మోహన్ రెడ్డి ఎవరనేది తెలియని పరిస్థితి ఉన్నది. ఇల్లందు, భద్రాచలంలోనూ అభ్యర్థులు ఇలాగే ఉన్నారు. డోర్నకల్ అభ్యర్థి భూక్యా సంగీత వారం క్రితమే చేరారు. నర్సంపేట, పరకాల, ములుగు, హుస్నాబాద్, మంథనిలోనూ సొంత నాయకులు లేరు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఈ స్థానాల్లో అవకాశం ఇచ్చే పరిస్థితి ఉన్నది.

### కత్తితో దాడి.. పలువురిపై కేసు నమోదు

మహాముత్తారం, అక్టోబర్ 22 : కత్తితో దాడి చేసిన వ్యక్తులపై ఆదివారం కేసు నమోదైంది. మహాముత్తారం ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. మహాముత్తారానికి చెందిన జోడు సురేశ్(33)పై కత్తితో దాడి చేసిన కొండ అరవింద్, కొండ విష్ణు, వారికి సహకరించిన జాడి రంజిత్, జీజే ప్రవీణ్, కుమ్మరి కమలాకర్, రోషిత్‌పై బాధితుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# రేవంత్‌రెడ్డి ఒక బ్రోకర్, చీటర్

- కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజలకు మళ్లీ కష్టాలే..
- ఈ నెల 27న మానుకోట, భట్టుపల్లికి సీఎం కేసీఆర్
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మానుకోట రాళ్లకు ఉన్న పౌరుషం బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు లేదు
- రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్
- సభాస్థలి, హెలిప్యాడ్ ఏర్పాట్ల పరిశీలన
- పాల్గొన్న ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, శంకర్ నాయక్, డీసీసీబీ చైర్మన్ మార్నేని


మడికొండ : ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు. పక్కన ఎమ్మెల్యే అరూరి రమేశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

మహబూబాబాద్(నమస్తే తెలంగాణ)/హనుమకొండ/మడికొండ, అక్టోబర్ 22 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఒక బ్రోకర్.., చీటర్ అని, ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ సర్వనాశనం ఖాయమని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. ఈ నెల 27న మధ్యాహ్నం 2గంటలకు మహబూబాబాద్‌లో, సాయంత్రం 4గంటలకు హనుమకొండ భట్టుపల్లిలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. కాగా, ఆదివారం మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందుతో కలిసి మంత్రి ఎర్రబెల్లి జిల్లా కేంద్రంలో, ఎమ్మెల్యే అరూరి రమేశ్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి భట్టుపల్లిలో సభాస్థలి, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆయా సమావేశాల్లో ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అన్ని పార్టీలను ముంచుతూ వస్తున్నాడని, ఇప్పుడు కాంగ్రెస్ వంతు వచ్చిందన్నారు. ఈ 27న మహబూబాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సుమారు 70వేల మంది ప్రజలు తరలిరానున్నట్లు వివరించారు. రాహుల్‌గాంధీ సభలకు ప్రజలు రావడం లేదు కాబట్టే రోడ్ షోలు పెట్టి కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేసిన గొప్ప నేత మన సీఎం కేసీఆర్ అని, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను రాష్ట్ర ప్రజలందరూ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక అవరోధాలు సృష్టించినా రాష్ట్ర ప్రగతిని ఆపని మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని, బీఆర్‌ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ కేంద్రం మానుకోటను జిల్లాగా మార్చి అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, హార్టికల్చరల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసి ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలకు నమ్మకం పోయిందని, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 10 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఒక్కఛాన్స్ అంటూ ప్రజలను ముందుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా బీజేపీ ఎందుకు గుర్తించలేదని ఎర్రబెల్లి ప్రశ్నించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఎందుకు మార్చలేదని, గిరిజన రిజర్వేషన్‌ను 10శాతానికి ఎందుకు పెంచలేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మళ్లీ కష్టాలు తప్పవన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలు తుపాకీ వెంకట్రాముడి ప్రగల్భాల్లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను కర్ణాటకలో కాపీకొట్టినా అమలు చేయలేక పోతున్నారన్నారు. వర్ధన్నపేట నియోజక వర్గ ప్రజా ఆశీర్వాద సభకు లక్ష మంది ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. వర్ధన్నపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్‌ను మరోసారి భారీ మెజారిటీతో ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. తెలంగాణ ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన గొప్పనాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఆయనను ముడోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు పట్టుదలతో ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు ఇంకా అభ్యర్థులు దొరకడం లేదని, ఆ పార్టీ అభ్యర్థులను ఢిల్లీ నాయకులే డిసైడ్ చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు మానుకోట రాళ్లకున్న పౌరుషం లేదన్నారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన బీఆర్‌ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. 27 న మహబూబాబాద్‌లో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీరెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, గద్దె రవి, మార్నేని రఘు, మార్నేని కిరణ్, పర్కాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు.. తండ్రీకూతుళ్ల మృతి

- దవాఖానలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి
- వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన

రాయపర్తి, అక్టోబర్ 22 : మండలంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పన్యానాయక్ తండా పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో వ్యక్తి దవాఖానలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొరిపిరాల గ్రామానికి చెందిన జీపీ మల్టీపర్పస్ వర్కర్ ఒరుగంటి వెంకన్న(49) చిన్న కుమార్తె, అల్లుడు ముంజంపల్లి అనూష(28)-రాజు హైదరాబాద్ నుంచి తొర్రూరుకు రాత్రి 11 గంటలకు చేరుకున్నారు. మొరిపిరాలకు వచ్చేందుకు వాహనాలేవీ అందుబాటులో లేకపోవడంతో తండ్రి వెంకన్న వారిని తన బైక్‌పై తీసుకు వస్తున్నాడు. ఈ క్రమంలో బురహాన్‌పల్లి గ్రామ శివారు గిరిజన తండాకు చెందిన ఓ వ్యక్తి కారును మితిమీరిన వేగంతో నడుపుతూ వెంకన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో వెంకన్నతో పాటు కుమార్తె అనూష అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన రాజును స్థానికులు 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, అనూషకు మూడేళ్ల కుమారుడు ఉండగా, ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని తెలిసింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వెంకన్న (ఫైల్)


అనూష (ఫైల్)

అలాగే మండల కేంద్రంలోని రజక కాలనీకి చెందిన మచ్చ పద్మ (52) వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

### నల్లబెల్లిలో యువకుడు..

నల్లబెల్లి : మండలంలోని బజ్జుతండాకు చెందిన తేజావత్ పరమేశ్‌నాయక్ స్నేహితులు తేజావత్ వెంకటేశ్, భూక్యా రాకేశ్‌తో కలిసి బైక్‌పై మండలకేంద్రానికి వెళ్తుండగా, రుద్రగూడెం సమీపంలో 365 జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో పరమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన వెంకటేశ్‌తో పాటు రాకేశ్‌ను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడి తండ్రి కొమ్మాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.


పరమేశ్(ఫైల్)

### కాల్వలో పడి యువకుడు..

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన యువకుడు వడాల నరేందర్(22) హుజూరాబాద్ చిన్నపాపయ్యపల్లి సమీపంలో ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నరేందర్ కరీంనగర్ జిల్లా సీడ్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. అయితే అతడి తాతకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చిన్నపాపయ్య పల్లె గ్రామానికి వెళ్లాడు. అక్కడి స్నేహితులతో దుర్గాభవాని మాల వేసుకున్నాడు. శనివారం తోటి స్వాములతో కలిసి ఎస్సారెస్పీ కాల్వ వద్దకు స్నానానికి వెళ్లాడు. స్నానం చేసి తిరిగి మెట్లు ఎక్కుతున్న క్రమంలో కాలు జారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో కేకలు వేయగా తోటి మిత్రులు గమనించి అతడిని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అప్పటికే మృతి చెందాడు. కొడుకు అకాల మరణంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.


నరేందర్(ఫైల్)

### కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

కాళేశ్వరం, అక్టోబర్ 22 : మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కన్నా(2)పై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడు వారి ఇంటి ముందు ఆడుకుంటుండగా, కుక్కలు ఒక్కసారిగా మీదపడి దాడి చేయగా, తల్లిదండ్రులు వాటిని తరిమేశారు. వెంటనే బాలుడిని మహదేవపూర్ దవాఖానకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. బాలుడికి వైద్యులు రెండు సర్జరీలు చేసినట్లు తల్లిదండ్రులు చెపారు.


కుక్కల దాడిలో గాయపడ్డ కన్నా

### మైసమ్మ ఆలయంలో హుండీ చోరీ

#### కానుకలు తస్కరించి జామాయిల్ తోటలో హుండీ పడేసిన దొంగలు

వాజేడు, అక్టోబర్ 22 : మండలంలోని వాజేడు, జగన్నాథపురం గ్రామాల మధ్య కాసారం ప్రధాన రహదారి పక్కనున్న మైసమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. హుండీ పగుల గొట్టి భక్తులు వేసిన నగదు, కానుకలను తస్కరించారు. తర్వాత హుండీని వాజేడు గ్రామ శివారులోని జామాయిల్ తోట పక్కన పడేసి వెళ్లారు. రహదారిపై అటుగా వెళ్లిన వారు గమనించి హుండీని మరల ఆలయం వద్దకు తీసుకొచ్చి పెట్టారు.


మైసమ్మ ఆలయం


హుండీని వాజేడు గ్రామ శివారులో వదిలేసిన దొంగలు